శ్రీ కశింకోట ప్రభాకరదేవ్

# కుక్కలు

వెలుగుని చీకటి కసికసిగా మింగేవేళ —

వరండాలో వాలుకుర్చీలో కూర్చొని న్యూస్‌పేపరు చదువుకొంటూంటే, మా పాలేరు వెంకడు చెమటలు కక్కుకుంటూ, ఆయాసపడిపోతూ "గోరం జరిగిపోనాది దొరా!" అంటూ వచ్చాడు.

వాడి వాలకం చూస్తుంటే ఏడవడానికి సిద్ధంగా వున్నవ్యక్తిలాగ కనిపించాడు. ముఖం బాగా పాలిపోయింది. ఏదో ఘోరాన్ని చూసిన వ్యక్తిలాగ వణుకుతున్నాడు.

"ఏం జరిగింది?" ప్రశ్నించాను.

"మావోడ్ని పోలీసులెత్తుకుపోయారు."

"ఏం తప్పుచేశాడని ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను. నా ప్రశ్నకు వెంకడి ముఖం చిన్నబోయింది.

"మావోడి సంగతి తవరికి తెలీదా దొరా! వాణ్ణి సత్తిగాల పోడు. ఆడ్నొట్టుకుని, నువు నకసలైటు వన్జెప్పి, ఈడ్చుకు పోయింద్రు. ఆడ్ని నువ్వే కాపాడాలి దొరా!" అంటూ నా కాళ్ళ మీదపడి భోరుమన్నాడు.

నాకేం చెయ్యాలో తెలియలేదు.

'వెంకడి కొడుకు నక్సలైటవడం ఏమిటి? ఇంపాసిబుల్. వాడొట్టి అమాయకుడు. పిరికివాడు. అటువంటి వ్యక్తిలో యింతటి తిరుగుబాటుతనం తలెత్తుతుందా?' నేను ఆలోచనల్లోపడి, మాట్లాడకపోవడంతో వెంకడు పైగావంచాతో కళ్ళొత్తుకుంటూ చెప్పడం ప్రారంభించాడు.

"ఇదంతా ఆ నాయుడుగోరు సేయించిన కుట్ర దొరా! మావోడ్ని నాయుడుగోరి బొట్టి (కూతురు) మనువాడుతానని సెప్పిందట. ఈ సంగతెర్సి నాయుడుగోరు తన బొట్టిని పిల్సి సీవాట్లెట్టారట. ఎన్ని సివాట్లెట్టినా ఆ నాయుడుగారి బొట్టి మావోడ్ని తప్పించి మరింకెవడ్ని మనువాడ్నని ధయిర్యంగా సెప్పేసిందట. మరిక నాభం నేదని సెప్పి, నకసలయిట్లు గురించి కూపీ తియ్యడానికి జవాన్లొత్తే...కుమ్మక్కై సేసేసి...మావోడు నకసలైటన్జెప్పి బొక్కల్నెట్టించీసినాడు మా బతుకుల్ని అన్యాయం సేసేసినాడు..."

వెంకడు చెప్పింది జాగ్రత్తగా విని గాఢంగా నిట్టూర్చాను. ఇక, నేనేం ప్రయత్నం చేసినా లాభం వుండదు. 'నక్సలైట్' అనే ముద్రతో అరెస్టు కాబడితే, అందులోనుండి బైటకు రప్పించగలగడం నావంటి వాళ్ళకు అసాధ్యం. అన్నింటికి భగవంతుడున్నాడంటూ, వెంకడ్ని మెల్లగా ఓదార్చి, ధైర్యంచెప్పి పంపించేశాను. అంతకన్నా మరి నేనేం చెయ్యగలను?

మనస్సంతా వికలమయింది. చీకటి బాగా వ్యాపించడంతో యింట్లోకి నడిచాను.

*   *   *

మర్నాడు—

మా యింటిముందు కోలాహలంగా వుండడంతో "ఏమిటా?" అని కిటికీలోనుండి చూశాను.

మున్సిపాలిటీబండి ఆగి వుంది.

అందులో బోలెడన్ని కుక్కలు రక్తసిక్తమై కుప్పగా పడి వున్నాయి. దుర్భరమైన బాధననుభవిస్తున్నట్లుగా, గట్టిగా అరవడానికి...కదలడానికి కూడా శక్తి లేనట్లుగా విలవిల్లాడుతూ ఆర్తనాదాలు గావిస్తున్నాయి.

ఆ బండిచుట్టూ జనం గుమిగూడి వున్నారు. కాకీరంగు నిక్కర్లు వేసుకున్న వ్యక్తులు పొడుగాటి కర్రల్ని, వలల్ని పట్టుకుని కుక్కలకోసం వీధిలో తిరుగాడుతున్నారు.

ఇంతలో, మా అయిదేళ్ళ 'పాప' గబగబా వీధిలోనుండి పరిగెత్తుకుంటూ నా దగ్గరకు వచ్చింది.

"డాడీ! ఆ కుక్కల్నెందుకు బండిలో పట్టుకెడుతున్నారు?" అని ప్రశ్నించింది.

"చంపేయడానికి..." ముక్తసరిగా జవాబు చెప్పాను.

"పాపం...ఎందుకు డాడీ! ఆ కుక్కల్ని చంపేస్తారు?" పాప కళ్ళల్లో సానుభూతి తొంగిచూసింది.

"పిచ్చి కుక్కల వలన సమాజానికి హాని కలుగుతుందని వాట్ని చంపేస్తారమ్మా!"

"మరి...ఆ కుక్కలన్నీ పిచ్చివేనా? అందులో ప్రతిరోజూ రాత్రి మన గుమ్మంలో పడుకుంటుందే ఆ కుక్కకూడా పిచ్చిదేనా డాడీ?" ప్రశ్నించింది.

'పాప' ప్రశ్నకు వులిక్కి పడ్డాను. ఎందుకో ఆ సమయంలో నక్సలైటుగా అరెస్టు గావించబడిన వెంకడి కొడుకు గుర్తుకు వచ్చాడు.

"ఊహూఁ... ఆ కుక్క పిచ్చిది కాదమ్మా!" అన్నాను బాధగా.

"మరెందుకు డాడీ! ఆ కుక్కను కూడా చంపివేయడానికి పట్టుకుపోతున్నారు?" ఆ చిన్నారి గొంతులో దుఃఖం ధ్వనించింది.

నా గుండె నెవరో పిండినట్లయింది.

"తమ స్వార్థంకోసం పాపా!" మనసులో చెలరేగుతున్న అలజడిని అణచుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పాను.

నా మాటలు పాపకు అర్థమయ్యాయో లేదోగాని మరింక నన్నేం ప్రశ్నించలేదు.

నక్సలైట్స్ హింసావాదులే కావచ్చు. వాళ్ళను అణచడం పౌర శాంతిభద్రతలదృష్ట్యా సమర్థనీయం కావచ్చు. అయితే, తమకు అడ్డం నిలచిన వాళ్ళను 'నక్సలైట్స్' పేరుతో పిచ్చికుక్కలను వేటాడినట్లుగా వేటాడ్డం ఏం న్యాయం? ధనికవర్గాల గుప్పిట నుండి ఈ వ్యవస్థ మారేదెప్పుడు? మార్చగలిగే నాథుడెవ్వడు??... అన్నీ ప్రశ్నలే.

బాధగా, నిస్సహాయంగా ఆర్తనాదాలు రవిస్తున్న రక్తసిక్తమయిన బండిలోని 'కుక్కలు'ను చూస్తూ స్థాణువులాగ నిలబడిపోయింది పాప.

# నువ్వూ - నేనూ

శ్రీ పి. యస్. శాస్త్రి

కమల్,
ఆరోజు నీ చెవిలో చెప్పిన మాటలు,
గుర్తున్నాయా నీకు ?
"నువ్వూ నేనూ యిప్పుడు కలిసివున్నాం సరదాగా !
ఎల్లకాలం యిలాగే వుంటామని, వుండాలని,
ఊసులు చెప్పుకుని, బాసలు చేసుకున్నాం !
కాని మన యీ ప్రేమ తీవ్రత తగ్గాక,
మన భౌతిక వాంఛలు తీరాక,
వాతావరణ కాలుష్యం,
కొంచెం కొంచెంగా మన మనస్సుల్లో చేరాక,
నువ్వన్నది నేనూ,
నేనన్నది నువ్వూ,
అతి తీవ్రంగా ఖండించడం ప్రారంభించాక,
నీమాట చెల్లాలని నువ్వూ
నా మాట నెగ్గాలని నేనూ
పట్టుబట్టడం ప్రారంభించాక,
మన ప్రేమ బంధాన్ని
పునరుద్ధరించి, గట్టిపరచగలిగింది
మన బుజ్జిపాప చిరునవ్వే సుమా !" అని !
అప్పుడు నీ మొహం ఎలాగైందో గుర్తుందానీకు ?
టమాటా ఎరుపు, గులాబీల మెరుపు,
అంతా కలగలుపు !
"ప్రియా, అలా జరగదుగాక జరగదు !
నీకూ నాకూ మధ్య విభేదాలు రావుగాక రావు !
ఇదే నా హామీ !
హాయిగా నిశ్చింతగా వుండు !"
అన్నావు నువ్వు !
"కాని నువ్వు ఓడిపోయావో లేదో
మన బుజ్జిపాప బోసినవ్వుచూసి చెప్పు !
ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తా !
నీమీద ఒట్టు ! నమ్ము నన్ను ! !"